## క్లుప్తంగా

### ప్రజల చెంతకే వైద్య సేవలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో వి.గౌతమి అధ్యక్షతన ×ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ 67 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలను ప్రజలకు అందిచడం ఈ ఫ్యామిలీ డాక్టర్ ముఖ్య ఉద్దేశమన్నారు. వైద్యాధికారి పర్యవేక్షణలో ప్రతి గ్రామాన్ని నెలలో రెండు సార్లు సందర్శిస్తారన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ర్యాలి ఆలయ అభివృద్ధికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి మచిలీపట్నంకు చెందిన పామర్తి ఫణిభూషణ సత్యసాయిప్రసాద్–రాధాదేవి దంపతులు రూ.10,101 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

### పంటకాల్వపై వంతెనకు శంకుస్థాపన



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జీజీఎం సోమునాయుడు

మామిడికుదురు: నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ (నాబార్డు) సహకారంతో పాశర్లపూడిబాడవలో పంట కాల్వపై రూ.10 లక్షలతో నిర్మించనున్న వంతెన పనులకు నాబార్డు ఏజీఎం, డీడీఎం వై.సోమునాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. రేవుకు వెళ్లే మార్గంలో పాంట కాల్వపై వంతెన పాడైపోయి చాలా కాలం నుంచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెన నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు చేసింది. నాబార్డు నిధులతో నిర్మించే వంతెనకు జీజీఎం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, పార్టీ నాయకులు తోరం సూర్యభాస్కర్, పాలూరి రాంబాబు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ప్లాన్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. స్థానిక గ్రామ సచివాలయం సమీపంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు, డాక్టర్ సాయి పవన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రపంచ అధిక రక్తపోటు (బీపీ) దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

### వడగాడ్పులతో అప్రమత్తంగా ఉండాలి



జొన్నాడలో వడగాడ్పులపై తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: వేసవిలో మండుతున్న ఎండల దృష్ట్యా సంభవించే వడదెబ్బ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వడదెబ్బ–నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరస్తూ అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. బుధవారం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ముఖ్య కూడళ్లలో వడదెబ్బకు గురైనపుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్సను వివరించారు. అలాగే డెంగీ వ్యాధి నివారణకు పరిశుభ్రత ముఖ్యమన్నారు. ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

### హత్యకేసుపై డీఎస్పీ విచారణ

ఆత్రేయపురం: గ్రామంలో ఈనెల 9న నక్కా మహాలక్ష్మి హత్య జరగడంతో బుధవారం డీఎస్పీ కేవీ రమణ విచారణ నిర్వహించారు. హత్య కేసులో మృతరాలు కోడలు బుజ్జమ్మను అరెస్టు చేసి కొత్తపేట కోర్టుకు తరలించిన విషయం తెలిసిందే. దీంతో గ్రామస్తులు హత్యపై పలు అనుమానాలు ఉన్నాయని ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. దీనిపై గ్రామస్తులను ఆయన వివరాలు అడిగి తెలుసుకుని దోషులను శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్సై సుధాకర్ తదితరులు ఉన్నారు.

# మత్స్యకార భరోసాతో స్వావలంబన

- ఖాతాల్లో రూ.10 వేలు జమ
- గంగపుత్రులకు అండగా ప్రభుత్వం



కాట్రేనికోనలో మత్స్యకార భరోసాలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్, ప్రజా ప్రతినిధులు

మామిడికుదురు: వైఎస్సార్ మత్స్యకార భరోసాతో గంగపుత్రులకు ప్రభుత్వం ఎంతో అండగా నిలుస్తోంది. గతంలో ఏ ప్రభుత్వంలోను ఆదుకోని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు భరోసా కల్పిస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మంగళవారం ప్రారంభించారు. సీఎం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. సముద్రంలో చేపల పునరుత్పత్తి సమయంలో వేట నిషేధం అమల్లోకి వస్తుంది. ఈ నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం రూ.10 వేల ఆర్థికసాయం అందించి వారిని ఆదుకుంటోంది. నాలుగేళ్ల నుంచి వేట విరామ సమయంలో రూ.10 వేలు వంతున ఆర్థిక సహాయం అందిస్తోంది. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల జాబితాలను వలంటీర్ల సహకారంతో సాగరమిత్రలు గతంలోనే గుర్తించారు. దాని ఆధారంగా లబ్ధిదారులకు జీవనభృతిని అందించారు.

**3071 మంది లబ్ధిదారులు..**

వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో 3071 మందికి ఆర్థికసాయం అందించారు. రాజోలు నియోజకవర్గంలోని సఖినేటిపల్లి మండలంలో 738, మలికిపురం మండలంలో 344, రాజోలు మండలంలో 436 మంది, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని మామిడికుదురు మండలంలో 1246 మంది, పి.గన్నవరం మండలంలో 229 మంది, అయినవిల్లి మండలంలో 21 మంది, అంబాజీపేటలో 15 మంది, అలాగే కొత్తపేట నియోజకవర్గంలోని ఆలమూరు మండలంలో 13 మంది, రావులపాలెం మండలంలో 18 మంది, కొత్తపేట మండలంలో ఏడుగురు, ఆత్రేయపురం మండలంలో నలుగురు లబ్ధిదారులు ఉన్నారు. 2019–20 నుంచి లబ్ధిదారులకు రూ.10 వేలు వంతున జీవన భృతిని అందిస్తున్నారు.

#### ప్రభుత్వం భరోసా కల్పించింది



వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా ప్రభుత్వం మాకు ఏటా జీవన భృతి అందించి మాకు భరోసా కల్పిస్తోంది. సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి ఒక్కరికి రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందిస్తున్నారు. గతంలో మొక్కుబడిగా సహాయం అందించే వారు. ఆ సహాయం కూడా నిషేధం ముగిసిన రెండు, మూడు నెలలకు అందించే వారు. దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. జగన్ సర్కారు నిషేధం సమయంలోనే సహాయం అందించి అండగా నిలుస్తోంది.

– రేకాడి శ్రీనివాసరావు, మత్స్యకారుడు, కరవాక

#### మత్స్యకారుల పక్షపాతి జగన్



జగన్ మత్స్యకారుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. మత్స్యకారుల పక్షపాతి జగన్ అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. సముద్రంలో వేట నిషేధం సమయంలో ఏటా మాకు ఆర్థిక సాయం అందించి మమ్మల్ని ఆదుకుంటున్న మహానుభావుడు జగన్. ప్రతి ఒక్క మత్స్యకారుడికి అతను ఆరాధ్యదైవంగా నిలిచారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఈ విధంగా మమ్మల్ని ఆదుకున్న నాథుడు లేడు.

– జగతాని సత్తిరాజు, మత్స్యకారుడు, గోగన్నమఠం

#### అర్హులందరికీ భరోసా



వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా గంగపుత్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దీంతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సముద్రంలో చేపల వేట ద్వారా జీవనం సాగించే అర్హులందరికీ మత్స్యకార భరోసా అందించాం. ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాబితాలను రూపొందించాం. దానికి అనుగుణంగానే వైఎస్సార్ మత్స్యకార భరోసా జీవనభృతి అందించాం.

– ఎల్‌బీఎస్ వర్ధన్, ఫిషరీస్ ఏడీ, రాజోలు

### ఉక్కబోతతో ప్రజలు సతమతం



ఆత్రేయపురంలో చెట్ల కింద సేద తీరుతున్న ప్రజలు

ఆత్రేయపురం: ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఉక్కబోతతో సతమతమవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఉదయ భానుడు ఉగ్రరూపం దాల్చుతూ మధ్యాహ్నానికి మరింతగా చెలరేగిపోతున్నాడు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యప్రతాపం అధికమైంది. ఎండకు తోడు గాలి కూడా బాగా వీస్తుండటంతో ఉక్కబోత మరింత పెరిగింది. ఎండ తీవ్రతకు చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే బొబ్బర్లంక బ్యారేజీ రహదారులు సైతం ఎండ తాకిడికి వెలవెలబోయాయి. 12 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. గ్రామాల్లో వృద్ధులు, రైతులు గ్రంథాలయాలు, ఆలయాలు, చెట్ల కిందకు పరుగులు తీస్తున్నారు. చిన్నారులు కాలువల వద్దకు వెళ్లి సేద తీరుతున్నారు. వేసవి తాపం తాళలేక శీతల పానీయాలు, బొప్పాయి, వివిధ రకాల పండ్లు కొనుగోలు చేయడంతో వాటికి గిరాకి పెరిగింది. ఎక్కువ మంది కొబ్బరి బొండాలు, పండ్లరసాలు, శీతల పానీయాలు తీసుకోవడం ద్వారా వేసవి తాపం నుంచి ఉపశమనం పొందే ప్రయత్నం చేశారు.

### ఆల్ క్యాస్ట్ కార్మిక యూనియన్ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి



తాడి వెంకటరెడ్డి

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన తాడి వెంకటరెడ్డి రెండోసారి ఆల్ క్యాస్ట్ కార్మిక యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కార్మిక యూనియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో రాజమహేంద్రవరం డివిజనల్ కోఆపరేటివ్ డివిజనల్ అధికారి ఎం.రామభక్తుడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా పరమటి వెంకట్రావు, కార్యదర్శిగా లంక రాజు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ నూతన కార్యవర్గం ఐదు సంవత్సరాల పాటు సేవలను అందించనున్నారు.

# పలు అభివృద్ధి పనులు ప్రారంభం



మలికిపురంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని పూర్తి స్థాయి చేతల ప్రభుత్వం అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం మలికిపురంలో పూర్తయిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో కడలి వారి మెరకలో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.7 లక్షలు, సీఎస్సార్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులు, రూ.10 లక్షల జేఎంఎం నిధులతో పూర్తి చేసిన మసీదు సీసీ రోడ్డు, రూ.25 లక్షలతో పూర్తి చేసిన వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఏకైక సంక్షేమ ప్రభుత్వం ఇదేనని అన్నారు. ఉనికి కోసం ప్రతిపక్షాలు ఆరాట పడుతున్నాయి తప్ప వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి విజయం జగన్‌నే వరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ కె.సీతా మహాలక్ష్మి, నాయకులు కేవీ చంటిరాజు, గెడ్డం తులసీభాస్కరరావు, బాబ్జి, రొక్కాల వెంకట్, జంపన బుజ్జిరాజు, కోళ్ళ వేణుప్రసాద్, గోపీ రాజు, మేడిద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కార మార్గాలను అధికారులు అన్వేషించాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం రాజోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో అందిస్తున్న వైద్యసేవలు, ఆర్బీకేలో రైతుల కోసం ఉన్న సౌకర్యాలు, నాడు–నేడు పథకంలో చేపడుతున్న పనుల వివరాలను సంబంధిత అధికారులు సమావేశంలో వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయడంలో ఎలాంటి అలసత్వం లేదని, పూర్తిస్థాయిలో రైతులు ధాన్యం విక్రయాలు సాగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కార మార్గాలు చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఏఓ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ప్రదాత జగన్‌ను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చిట్టిబాబు



ఎల్.గన్నవరంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పిలుపునిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం లంకల గన్నవరంలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంచారు. సంక్షేమ ప్రదాతగా ప్రజల నీరాజనాలందుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మాట తప్పలేదు, మడమ తిప్పలేదు అంటూ జగన్‌ను కీర్తించారు. దేశంలో అన్ని రాష్ట్రాల చూపు మన రాష్ట్రంపై ఉందన్నారు. అటు అభివృద్ధితో పాటు ఇటు సంక్షేమ పథకాలను వెల్లువలా అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. జగన్ సర్కారుకు ప్రజలు అడగడుగునా అండగా నిలుస్తున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ నక్కా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, పార్టీ నేతలు మానుకోట ప్రసాద్, ఉలిశెట్టి బాబి, అన్నాబత్తుల చంటి, దొంగ వినాయక్‌రామ్, లంకే గోపాలకృష్ణ, కొప్పాడి నాగభూషణం, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాలతో ఉపశమనం



అంబాజీపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: వేసవి తాపం నుంచి సేద తీరేందుకు చలివేంద్రాలతో ఉపశమనం పొందవచ్చని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండలు మండిపోతున్నాయని అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద, ముఖ్య కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, మామిడిశెట్టి బుల్లియ్య, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.

### మహిళను గాయపర్చిన వ్యక్తులపై కేసు

అయినవిల్లి: సరిహద్దు తగదా విషయమై ఓ మహిళను గాయపర్చిన వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన వరద మరియమ్మకు పెయ్యల సత్యనారాయణకు సరిహద్దు తగదా ఉంది. ఈ నేపథ్యంలో పెయ్యల సత్యనారాయణ, పెయ్యల భీమారావు, మరియమ్మను కొట్టారు. చికిత్స కోసం మరియమ్మను అమలాపురంలోని ఆస్పత్రికి తరలించారు. దీనిపై మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

### ఆటోడ్రైవర్లకు ఏఎంవీఐ అవగాహన



కొత్తపేటలో ఆటో డ్రైవర్లకు షర్టులు పంపిణీ చేస్తున్న ఏఎంవీఐ కాశీవిశ్వేశ్వరరావు

కొత్తపేట: ఆటోడ్రైవర్లు వాహన చట్టం నిబంధనలు, జాగ్రత్తలు పాటిస్తూ ఆటోలను డ్రైవ్ చేయడం ద్వారా ప్రయాణికులను భద్రంగా గమ్యానికి చేర్చాలని అమలాపురం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) డి.కాశీవిశ్వేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక ఈవని రామచంద్ర హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు, ఆ సంస్థతో పాటు ఈవని రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవల్లో భాగంగా ఆటో డ్రైవర్లు కోడ్‌గా ధరించే కాకీ షర్టులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థల చైర్మన్ ఈవని సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏఎంవీఐ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈవని రామచంద్ర పెట్రోల్ బంక్, చారిటబుల్ ట్రస్ట్ వారి సామాజిక సేవ అభినందనీయమన్నారు. అనంతరం 50 మంది ఆటో డ్రైవర్లకు షర్టులు, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెట్రోఫిల్ మేనేజర్ విన్నకోట రాఘవేంద్రరావు, అపర్ణాంబికాదేవి, సూపర్‌వైజర్ పి.కృష్ణ, పలివెల అభయాంజనేయ స్వామి ఆలయ ఫౌండర్ విన్నకోట మారుతీ బంగారం తదితరులు పాల్గొన్నారు.

# కాజ్‌వే కూలి ట్రాక్టర్ బోల్తా



కాజ్‌వే కూలిపోయి డ్రైన్‌లో బోల్తా పడిన ట్రాక్టర్

త్రుటిలో తప్పిన ప్రమాదం

మామిడికుదురు: రెండు గ్రామాల సరిహద్దులోని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై శిథిలమైన కాజ్‌వే బుధవారం కుప్పకూలింది. దొక్కపాట్లు లోడుతో కాజ్‌వే మీదుగా ట్రాక్టరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్‌పై ఉన్న కూలీలు చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. డ్రైన్‌లో బోల్తా పడిన ట్రాక్టర్‌తో పాటు ట్రక్కును జేసీబీ సహాయంతో బయటకు తీశారు. పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల సరిహద్దులో ఉన్న ఈ కాజ్‌వే గత కొంత కాలం నుంచి శిథిలస్థితిలో ఉంది. ఇది పూర్తిగా పాడైపోయింది. కాజ్‌వేకు ఒక వైపు భాగం గతంలో దిగబడి పోయింది. అప్పటి నుంచి ఈ కాజ్‌వేపై ప్రయాణం దినదిన గండంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాజ్‌వే కుప్ప కూలిపోయింది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఈ కాజ్‌వే కూలిపోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగైదు గ్రామాల ప్రజలు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కాజ్‌వే కూలిపోవడంతో తమకు ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాశర్లపూడిలంక, లూటుకుర్రు గ్రామాల సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు కూలిపోయిన కాజ్‌వేను పరిశీలించారు. ఈ కాజ్‌వే పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై కూలిపోయిన కాజ్‌వేను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు అక్కడ నెలకొన్న పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. కాజ్‌వే పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చిట్టిబాబు హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నేతలు యూవీవీ సత్యనారాయణ, నెల్లి దుర్గాప్రసాద్, అంకాని వీరాంజనేయులు, చిక్కం బుజ్జిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, బాలం రమేష్, యల్లమెల్లి శ్రీనివాస్, కుడుపూడి రామకృష్ణ ఉన్నారు.

# వైఎస్సార్ సీపీతోనే శెట్టిబలిజలకు గుర్తింపు



ఎమ్మెల్సీ కుడుపూడిని కలసి అభినందిస్తున్న శెట్టిబలిజ నేతలు

మలికిపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీతోనే శెట్టిబలిజలకు రాజకీయంగా తగిన గుర్తింపు లభించిందని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసి అమలాపురం విచ్చేసిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణను బుధవారం అమలాపురంలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ కుడుపూడికి శాలువా కప్పి సన్మానం చేశారు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శెట్టిబలిజలు ముఖ్యమంత్రి జగన్‌కు వెన్నంటి ఉన్నారని ప్రతిగా శెట్టిబలిజలకు ముఖ్యమంత్రి అధికంగా ప్రాధాన్యం ఇచ్చి గౌరవించారని ఉమ అన్నారు. జీఎన్నార్ ట్రస్ట్ అధ్యక్షుడు, ఎన్నారై డా.గెద్దాడ నాగేశ్వరరావు, సంఘ నాయకులు గుబ్బల బాబ్జి, జీవీవీ సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ తదితరులు కుడుపూడిని కలసిన వారిలో ఉన్నారు.

# చిన్నారుల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజక్షన్లు చేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారుల తీరును నిరసిస్తూ ధర్నా

మామిడికుదురు: 45 ఏళ్ల నుంచి తమ స్వాధీనంలో ఉన్న భూముల నుంచి మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పెదపట్నం గ్రామస్తులు బుధవారం ధర్నా చేపట్టారు. ఏటిగట్టుపై టెంటు వేసి టిప్పర్లు రాకుండా అడ్డుకున్నారు. పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామ పరిధిలోని 97.19 ఎకరాల భూమి 1985 నుంచి ఆల్ క్యాస్ట్ ఫీల్డ్ కో–ఆపరేటివ్ సొసైటీకి చెందిన 425 మంది సభ్యుల స్వాధీనంలో ఉందన్నారు. ఈ భూమిలో అప్పటి నుంచి సొసైటీ సభ్యులు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని వాపోయారు. దీనిపై రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉందన్నారు. ఈ భూముల నుంచి మట్టిని తవ్వుకునేందుకు సంబంధిత శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ స్వాధీనంలోని భూముల్లో మట్టి తీయకుండా చర్యలు తీసుకోవాలని ధర్నా చేశారు. ఇక్కడ ఉన్న పరిస్థితులను రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఉన్నతాధికారుల మాట కూడా లెక్క చేయకుండా కింది స్థాయి అధికారులు మట్టి తవ్వకాలకు అనుమతిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఉత్వర్వులకు విరుద్ధంగా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ ధర్నాలో సొసైటీ అధ్యక్షుడు కోడేటి సాయిశంకరం, కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు విప్పర్తి ఏసు, సంఘం సభ్యులు పాల్గొన్నారు. దీనిపై సర్వే చేయించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పి.గన్నవరం తహసీల్దార్ ఠాగూర్ తెలిపారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూల్ ఫ్లెక్సీలు

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూల్ ఫ్లెక్సీలు
- ఆకట్టుకుంటున్న వినూత్న ప్రచారం




పెదపట్నంలంకలో ఏర్పాటు చేసిన జెడ్పీ ఉన్నత పాఠశాల ఫ్లెక్సీలు

మామిడికుదురు: 'ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ బోధన' ఈ తరహా ప్రచారం కేవలం ప్రైవేటు స్కూళ్ల నుంచి మాత్రమే జరుగుతుంది. కానీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ స్కూళ్లు కూడా ప్రచారంపై ప్రధానంగా దృష్టి సారించాయి. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 'ఉత్తమ ఫలితాలు సాధించామని', 'అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని', 'పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించండి' అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు విద్యార్థులను, స్టూడెంట్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాల పేరిట ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేయించి గ్రామంలో పలు చోట్ల వాటిని ప్రదర్శించడం విశేషం. 2022–23లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా మన పెదపట్నంలంక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజయదుందుభి అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 64 శాతం ఉత్తీర్ణత సాధించామని, 73 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో ముగ్గురు విద్యార్థులకు 500 పైబడి మార్కులు వచ్చాయని, ప్రథమశ్రేణిలో 36 మంది, ద్వితీయ శ్రేణిలో 8 మంది ఉత్తీర్ణులయ్యారంటూ ఫ్లెక్సీల్లో ప్రముఖంగా పేర్కొన్నారు. 500 పైబడి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులు కొమ్ముల మౌనికవెంకటసత్యశ్రీ, జవ్వాది తనూజ, కాజులూరి మోహనసీతారామదేవి ఫొటోలను ప్రముఖంగా ముద్రించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు అటు విద్యార్థులను, ఇటు పేరెంట్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోకా వెంకన్నబాబు, పీఎంసీ కమిటీ చైర్మన్ గిడుగు బాబ్జి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.